www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 14 ఫిబ్రవరి 2023
5
అన్నమయ్య

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-వాల్మీకిపురం

స్థానిక కొత్తపేటవీధిలోని స్వతంత్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న జునైద్ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎఎస్ఎన్ కుమార్ తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ నూజివీడులో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో తన ప్రతిభను చాటి జాతీయస్థాయి పోటీకి ఎంపికైనట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంపికైన జునైద్ రాష్ట్ర జట్టులో చురుకుగా పాల్గొని, రాష్ట్ర జట్టు విజయానికి కృషి చేయాలని పులుపునిచ్చారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే మంచి ప్రతిభ, తెలివి తేటలు, ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. తద్వారా తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి, చదువుకున్న బడికి సేవ చేసే అవకాశం లభిస్తోందన్నారు. అనంతరం పాఠశాల ఇన్‌ఛార్జ్ హసీనాబేగం, ఉపాధ్యాయులు జునైద్‌ను అభినందించారు.

బాస్కెట్‌బాల్ పోటీకి ఎంపికైన జునైద్

'ఉక్కు' ఆశలకు రెక్కలు

- జిల్లా ప్రజల కలలు సాకారం
- నిర్మాణానికి రూ.8,800 కోట్లు కేటాయింపు
- రేపు సిఎం జగన్‌చే పనులు ప్రారంభం

కడప జిల్లా ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తున్న ఉక్కుకర్మాగారం ఏర్పాటుకు పునాది పడనుంది. ఉక్కు పరిశ్రమపై జిల్లా నిరుద్యోగ యువత పెట్టుకున్న ఆశలు సాకారం కానుంది. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది డిసెంబర్ విజయవాడలో నిర్వహించిన ఓ సమావేశంలో జిందాల్ (జెఎస్‌డబ్ల్యు స్టీల్ లిమిటెడ్) ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అందుకు రూ. 8,800 నిధులు కూడా కేటాయించారు. ఎన్నికల హామీలలో భాగంగా మూడేళ్లల్లో కడప ఉక్కు పరిశ్రమను పూర్తి చేస్తామని బహిరంగ సభలో జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. 2019లో శంకుస్థాపన చేశారు. తరువాత పనులు ప్రారంభించలేదు. ఎట్టకేలకు ఈనెల 15న సిఎం చేతుల మీదుగా ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభించనుండడంతో జిల్లా వాసుల్లో ఆశలు చిగురించాయి.

ప్రజాశక్తి-జమ్మలమడుగు/ రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కడప జిల్లా వాసి కావడంతో తన తండ్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి కలను సాకారం చేయడంలో ముందు ఉంటారని అందరూ భావించారు. 2019 ఎన్నికల హామీల్లో భాగంగా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అదే ఏడాది ఆయన డిసెంబర్ 26న ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. ఆనాటి నుండి నేటి వరకు ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. దీంతో కడప జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే పరిస్థితి నెలకొంది. దాదాపు మూడేళ్ల తరువాత 2022 డిసెంబర్ 12న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర పెట్టుబడిల ప్రోత్సాహక మండలి సమావేశంలో కడప జిల్లా ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు జెఎస్‌డబ్ల్యు స్టీల్ లిమిటెడ్‌ను ఒప్పించి స్టీల్ ప్లాంట్ ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. 2019లో రాష్ట్ర బడ్జెట్లో జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు రూ .250 కోట్లు నిధులను కేటాయించారు. మొదటి బడ్జెట్ లోనే కడప ఉక్కు పరిశ్రమను ప్రస్తావించడంతో జిల్లా ప్రజలు, నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ ఆ నిధులతో కేవలం భూ సేకరణ పనులు మాత్రమే చేపట్టారు. మూడేళ్లయినా స్టీల్‌ప్లాంట్ పనులు ముందుకు సాగక పోవడంతో నిరుద్యోగులలో నిరాశ నిస్పృహ నెలకొంది. 2007

అధికారులు ఏర్పాటు చేసిన జర్మన్ హ్యాంగర్ డాబా

జూన్ 10న అప్పటి ముఖ్యమంత్రి, కీ.శే.వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. బ్రహ్మణి ఉక్కు పరిశ్రమ జమ్మలమడుగు ప్రాంతంలోని చిట్టిమీట చింతల సమీపంలో నిర్మాణం చేపట్టారు. అప్పటి ప్రభుత్వం బ్రహ్మణి ఉక్కు పరిశ్రమ కోసం 10 వేల ఎకరాల భూమిని సేకరించింది. ఎయిర్ పోర్టు నిర్మాణానికి మరో 3200 ఎకరాలనూ కేటాయించింది. బ్రహ్మణి ఉక్కు పరిశ్రమ పనులు దాదాపు 40 శాతం పనులు కూడా పూర్తి అయ్యాయి. బ్రహ్మణి ఉక్కు పరిశ్రమ యజమాని గాలి జనార్దన్ రెడ్డి జైలుపాలు కావడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అప్పటి నుంచి జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఏ ముఖ్యమంత్రి ప్రయత్నం చేయలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ అలాంటి ప్రయత్నమే చేయలేదు. వై.ఎస్. కాంగ్రెస్ పార్టీ 2019లో ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మళ్లీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. జిల్లాలో చదువుకున్న ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావించారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా 20 వేల మందికి ఉపాధి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. ఈనెల 15న మండల పరిధిలోని కన్యతీర్థం సమీపంలో జిందాల్ ఆధ్వర్యంలో సిఎం ప్రారంభించబోయే పనులు సకాలంలో పూర్తయి నిరుద్యోగుల ఆశలు నెరవేరుతాయో లేదో వేచి చూడాలి.

ఏర్పాట్ల పనులు ముమ్మరం

ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించబోయే స్టీల్ ప్లాంట్ భూమి పూజకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కేవలం 500 మందితో భూమి పూజ చేపడతున్నారని తెలుస్తోంది. ఆ మేరకు జర్మన్ హ్యాంగర్ అనే కొత్త డాబాను ఏర్పాటు చేశారు. మరో వైపు స్టీల్‌ప్లాంట్ కోసం డికెటి భూములు కొనుగోలు చేసిన వారికి పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాలని బాధితులు కోరుతున్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగ అవకాశాల్లో భూములు ఇచ్చిన సిరిగేపల్లి, పెద్దదండ్లూరు, సున్నపురాళ్లపల్లె గ్రామస్తులతోపాటు స్థానికులకే మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్నారు.

ట్రిపుల్‌ఐటి విద్యార్థిని ఆత్మహత్య

పజాశక్తి - వేంపల్లె

కడప జిల్లా వేంపల్లె మండలంలోని ఆర్‌జెయుకెటి ఇడుపుల పాయి ట్రిపుల్‌ఐటిలో ఇ-4 చదివే ఇంజినీరింగ్ విద్యార్థిని మంగిర అఖిల(22) ఆత్మహత్య చేసుకుంది. విద్యార్థులు, అధికారుల సమాచారం మేరకు... అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం శిబ్యాల పంచాయతీ బోగం పల్లెకు చెందిన యోగాంజనేయులు, విజయలకు చెందిన అఖిల ఇడుపుల పాయి ట్రిపుల్‌ఐటిలో ఎలక్ట్రానిక్ కంప్యూటర్ ఇంజినీరింగ్ చదువుకుంటోంది. సోమవారం ఉదయం దాదాపు 9 గంటల మధ్యలో తల్లి విజయతో ఫోన్‌లో మాట్లాడిన అఖిల గదిలో ఎవరూ లేని సమయంలో కిటికీకి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొంది. చదువులో బాగా రాణిస్తున్న అఖిల ఆత్మహత్య చేసుకోవడంతో ట్రిపుల్‌ఐటిలో ఉన్న విద్యార్థులు శోక సముద్రంలో మునిగి పోయారు. చిత్రావతి వసతి గృహంలోని గదిలో అఖిలతో పాటు మరో ఇద్దరు విద్యార్థినులు ఉంటున్నారు. తల్లితో ఫోన్‌లో మాట్లాడిన అఖిల క్లాసులు వెళ్లేందుకు స్కూల్ డ్రస్‌ను వేసుకుని ఉంది. గదిలో ఉన్న ఇరువురు విద్యార్థులు ముందుగా క్లాసులకు వెళ్లడంతో గదిలో ఒక్కటే ఉన్న ఆఖిల ఎవరూ లేని సమయంలో గదికి తలుపు వేసుకుని అఘాయిత్యానికి పాల్పడింది. లీజర్ కావడంతో తోటి విద్యార్థులు గది వద్దకు వచ్చి తలుపును కొట్టగా తలుపు తీయక పోవడంతో ట్రిపుల్‌ఐటి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు గది వద్దకు వచ్చి తలుపు తీయగా అఖిల కిటికీకి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం బయట పడింది. హుటాహుటిన విద్యార్థులు అఖిల మెడకు ఉన్న చున్నీని తొలగించి కిందకు దింపగా అప్పటికే మృతి చెందినట్లు ట్రిపుల్‌ఐటి సిబ్బంది తెలిపారు. విసి విజయ్ కుమార్, ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ సంధ్యారాణి సంఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రంగారావు, తిరుపాల్ నాయక్ సంఘటన వద్దకు వచ్చి పరిస్థితిని ఆరా తీశారు. విద్యార్థికి చెందిన సెల్‌ఫోన్, లాప్‌ట్యాప్‌ను స్వాధీనం చేసుకొని తోటి విద్యార్థులను సంఘటనకు చెందిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి మృతదేహాన్ని అంబులెన్స్‌లో వేంపల్లె ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి మృతి చెందిన వెంటనే రాయచోటిలో ఉన్న తల్లి విజయకు సమాచారం ఇచ్చారు. ఆమె వేంపల్లెకు చేరుకొని కుమార్తె మృతదేహం వద్ద బోరున విలపించింది. కుటుంబ సమస్యలతో విద్యార్థి మృతి చెందినట్లు ప్రాథమిక విచారంలో తెలిసినట్లు డైరెక్టర్ సంధ్యారాణి చెప్పారు. అఖిలకు ఇంటి వద్ద ఎలాంటి సమస్యలు లేవని తాము కష్టపడి పిల్లలను చదివించు కొంటున్నట్లు మృతురాలి తల్లి విజయ వాపోయారు. ఇద్దరు పిల్లల్లో అఖిల పెద్ద అమ్మాయి అని మరో కుమారుడు బిటెక్ చదువుతున్నట్లు తెలిపారు. అఖిలను తాము ముద్దుగా పెంచుకొం టున్నా మని ఇంతలోనే ఆత్మహత్య చేసుకోవడం జీర్ణించుకోలేక పోతున్నట్లు విజయ కన్నీరు మున్నీరుగా విలపించింది. విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం చాల బాధకరమని డైరెక్టర్ సంధ్యారాణి తెలిపారు. క్షణికావేశంతో విద్యార్థులు ఇలాంటి సంఘటనలు చేసుకోవడంతో జీవితం నాశనం కావడంతో పాటు తల్లిదండ్రులకు క్షోభకు గురి చేస్తుందని చెప్పారు. విద్యార్థులు ఆత్మహత్యలకు దూరంగా ఉండాలని కోరారు. విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలు తెలియలేదు. విద్యార్థినీ తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. కాగా అఖిల తండ్రి యోగాంజనేయులు కువైట్‌కు బతుకుదెరువు కోసం వెళ్లారు.

ఉరేసుకుని మృతి చెందిన విద్యార్థిని, మంగిర అఖిల (ఫైల్‌ఫొటో)

ఈద్గా వద్ద పనులను పరిశీలిస్తున్న నాయకులు

మైనార్టీల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సిఎం వై.ఎస్. జగన్, ఎమ్మెల్యే, ఎంపీలు మైనార్టీల పక్షపాతి అని, వైసిపి మైనార్టీ నాయకులు, ఈద్గా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ బేపారి మహమ్మద్ ఖాన్ అన్నారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో, ఎంపీపెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సొంత నిధులతో అన్నమయ్య జిల్లా ఈద్గా కమిటీ అధ్యక్షులు హాజి బషీర్ ఖాన్ అధ్వర్యంలో ఈద్గా ప్రాంగణంలో ఓజుఖాన నిర్మాణం పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఈద్గా అభివృద్ధికి అందించిన సహకారం పట్ల ప్రతి ఒక ముస్లిం మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలోనూ ఈద్గా ప్రహరీ నిర్మాణం ,ఇతర అభివృద్ధి పనులు ఎంపీ నిధులతోనే చేపట్టారని చెప్పారు. గత నెలలో ఈద్గాలో నిర్వహించిన సమావేశంలో ఈద్గా ప్రార్థనలకు వచ్చే వారికి ఓజుఖానాను నిర్మించాలని కమిటీ తరపున ఎమ్మెల్యే అధ్వర్యంలో ఎంపీ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. పనులకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. చెప్పిన మాట, హామీ ప్రకారం వారి నిధులతో నిర్మాణం ప్రాంబించినట్లు ఈ సందర్బంగా వారు తెలియజేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి రంజాన్ మాసంలో జరిగే ప్రార్థన లకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫజులుల్ బెగ్, గౌస్ పీర్, అంజద్, బేపారి జబివుల్ల ఖాన్, షాకీర్, అసద్, అనస్ పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలోని బెసంట్ దివ్యజ్ఞాన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. డిగ్రీ విద్యార్థులకు కామర్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులను బోధించుటకు అనుభవం కలిగి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 18వ తేదీ లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 20వ తేదీన ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ, విద్యార్థులకు డేమో తరగతులకు హాజరు కావాలని తెలిపారు. హాజరయ్యే అభ్యర్థులు సంభందిత పీజీ కోర్సులో 55 శాతం మార్కులతో పాటు ఎంఫిల్, పిహెచ్‌డి లేదా యుజిసి నెట్, ఎపిసెట్‌లో అర్హత సాధించిన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

మామిడి తోటలను పరిశీలించిన ఉద్యానవన అధికారి

ప్రజాశక్తి -కలకడ

మామిడి తోటలను మండల ఉద్యానవన శాఖ అధికారి సుకుమార్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఆరండకలవారిపల్లి, జరిగడ్డకు చెందిన రైతులు కమలాకర్‌రెడ్డి, తిప్పారెడ్డి భూములలో వేసిన మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి మొక్కలకు తేనె మంచి పురుగు, తామర పురుగులు మామిడి తోటలో పోతను నాశనం చేస్తాయని, వీటిని నివారించడానికి ఆంధ్రకొనైజ్, టైమ్ ఎంతో మిక్స్ వంటి మందులను పిచికారి చేసి కాపాడుకోవాలని సూచించారు. తిప్పారెడ్డి రైతుకు మంజూరైన బ్యాక్ హౌస్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు కమలాకర్‌రెడ్డి, తిప్పారెడ్డి, విఎఎ చందన పాల్గొన్నారు.

మామిడి తోటలను పరిశీలిస్తున్న అధికారి

దళితులకు భూ పట్టాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పెనగలూరు తరుణంపల్లి దళితులకు భూ పట్టాలివ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. సోమవారం పెనగలూరు సిఐటియు మండల కార్యదర్శి మద్దెల ప్రసాద్ అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట భూబాధితులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం కోడూరు పంచాయితీలోని తరుణంపల్లిలో 450 కుటుంబాలు నివాసమున్నాయని, వాటిలో దళితులు వందకు పైగా ఉన్నారని చెప్పారు. ఎలాంటి ఉపాధి లేక వలసలు వెళ్తున్నారని పేర్కొన్నారు. సర్వే నంబరు 354, 355లలో ప్రభుత్వ భూమి 2434 ఎకరాలున్నాయని, వాటిని పంచితే జీవనోపాధి లభిస్తుందని చెప్పారు. దళితులు పలు దఫాలు అర్జీలు పెట్టుకున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. ప్రస్తుతం అదే గ్రామంలో ఆర్థిక స్థోమత ఉన్న అగ్ర కులాల వారికే భూమి ఇచ్చే విధంగా అధికార యంత్రాంగం సర్వే చేస్తున్నారని తెలిపారు. భూ పంపిణీలో మొదటి ప్రాధాన్యత భూమి లేని, ఉపాధి కొరవడిన దళితులకు రెండు ఎకరాల భూమి ఇచ్చి వలసలు నివారించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర చెప్పారు. లేకపోతే దళితులను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం అర్జీలను జెసికి అందజేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కో- కన్వీనర్ డి.సి. వెంకటయ్య, తరుణం పల్లి రైతులు మద్దెల.రవి, లక్ష్మి నర్సమ్మ, పల్లాల వంశీ రవిచంద్ర రెడ్డి, పోగు హరిబాబు, నందకుమార్, దండు రమణయ్య, జకరయ్య, పుల్లయ్య, బుజ్జయ్య, గంగయ్య, ముసలయ్య, అశోక్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన చేస్తున్న దళితులు, సిఐటియు నాయకులు

ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న డాక్టర్ శ్యామల

ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కంభంవారిపల్లె

మండలంలోని గర్నిమిట్టలో ప్రయివేట్ ఆస్పత్రులను సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్యామల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రుల నిర్వాహకులతో మాట్లాడుతూ ప్రాక్టీస్ చేసే ప్రతి ఒక్కరూ కచ్చితంగా క్లినిక్ నేమ్ బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు. బోర్డులో 'ప్రథమ చికిత్స కేంద్రం' అని మాత్రమే నమోదు చేయాలన్నారు. ప్రాక్టీస్ చేసే వారి పేరు ఎదురుగా డాక్టర్ అనే పదం వాడరాదని సూచించారు. క్లినిక్‌లో ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, వ్యాధులు రాకుండా సలహాలు సూచనలు అందజేసి మిగతా వారిని ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలని సూచించారు. క్లినిక్‌ల్లో బెడ్స్ ఏర్పాటు చేయడం, ఐవి ఫ్లూయిడ్స్ ఎక్కించడం, స్టెరాయిడ్లు, మత్తుమందులు, యాంటీబయోటిక్స్ ఇంజక్షన్ వేయడం చేయరాదన్నారు. అనధికారికంగా మందులు అమ్మడం, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయటం కాని, వాటిని సూచించడం కాని చేయరాదన్నరు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే కచ్చితంగా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ రేష్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు కృష్ణమ్మ, కృష్ణయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తం, చెన్నమ్మ, ఆశారెడ్డి లక్ష్మి పాల్గొన్నారు.

రైళ్లు నిలుపుదల చేయాలని వినతి

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలో జయంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు కోవిడ్‌కు ముందు నిలుపుదల ఉన్న రైళ్లను నిలుపుదల చేయాలంటూ కోరుతూ దక్షిణమధ్య రైల్వే సిపిఆర్ఓ సిహెచ్ రాకేష్‌ను సోమవారం రైల్ నిలయంలో అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏనుగుల బాలాంజనేయులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో సిపిఆర్ఓ రాకేష్ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి త్వరలో రైళ్ల నిలుపుదల చేసేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు బాలాంజనేయులు పేర్కొన్నారు.

ప్రతి విద్యార్థీ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గాలివీడు

ప్రతి విద్యార్థీ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, శారీరక దారుఢ్యం అవసరమని సిహెచ్ఓ సబ్బులక్ష్మీదేవి పేర్కొన్నారు. సోమవారం బిసి బాలికల వసతి గృహంలో విద్యార్థినుల బరువు, ఎత్తు కొలతలు తీశారు. అనంతరం బాలికలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గాలివీడు-2 ఎఎన్ఎం ఆనందజ్యోతి, ఆశావర్కర్లు రమణమ్మ, నాగేశ్వరమ్మ, ఇందిరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి బరువును పరిశీలిస్తున్న సిబ్బంది

నీటి సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

గ్రామాలలో నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. జల సంజీవని మిషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపిడిఓ సభా భవనంలో జల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 నాటికి ప్రతి ఒక్కరికీ మంచి నీటి కుళాయిల ద్వారా 55 లీటర్ల నీటిని అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యంగా పెట్టుకున్నాయని పేర్కొన్నారు. జల సంజీవన్ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. గ్రామ స్థాయి పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసి కమిటీలు ద్వారా నీటిని అందిస్తామన్నారు. నీటిని టెస్ట్ ద్వారా పరీక్షలు నిర్వహించి ఆ గ్రామంలోని మంచినీటి శాతాన్ని గుర్తించి అవసరమైనంతవరకు మంచినీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలోనూ సురక్షిత మంచినీరు అందించడమే ప్రభుత్వాల లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ కిషోర్ కుమార్, నీటి పరిరక్షణ అధికారి పెంచల్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నీటి పరీక్ష విధానాన్ని వివరిస్తున్న పెంచల్‌రెడ్డి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెసి తమీమ్ అన్సారీయా

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాయచోటి

ఈ నెల 13 నుంచి 17 వరకు నిర్వహించబోయే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు పోస్టర్‌ను సోమవారం జెసి తమీమ్ అన్సారీయా కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2016 నుంచి ప్రతి ఏడాది ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. దేశవ్యాప్తంగా ప్రపంచంలో వివిధ అంశాలపై ఆర్థిక విద్యా సందేశాలను ప్రచారం చేయనున్నామని చెప్పారు. వారోత్సవాల్లో భాగంగా డిజిటల్ లావాదేవీలు సౌలభ్యం గురించి అవగాహన, డిజిటల్ లావాదేవీల భద్రత, కస్టమర్ల రక్షణ, వచ్చిన ఆదాయాన్ని ఏ విధంగా ప్రజలు ఖర్చు , పొదుపు గురించి అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని బ్యాంకు లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడి జయరాజు, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

పాల సేకరణకు నోడల్ టీమ్ ఏర్పాటు : ఎంపిపి

ప్రజాశక్తి-పెద్దమండ్యం

అమూల్ కేంద్రాలకు పాలు సేకరించేందుకు ఒక్కొక్క కేంద్రానికి నోడల్ టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిపి పూర్ణచంద్రిక అన్నారు. సోమవారం ఎంపిడిఓ కార్యాలయంలో జగనన్న పాల వెల్లువ పథకం నిర్వహణపై రూట్ ఆఫీసర్లు, ముసలీకుంట, పెద్దమండ్యం, బండ్రేవు, పాపేపల్లి పంచాయతీ కార్యదర్శులు, పశు సంవర్ధక సహాయకులు, వాలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమూల్ ద్వారా మండలంలో 55 పాల సేకరణ కేంద్రాల పాల సేకరణ చేయాలన్నారు. ఈ నెల నుండి అమూల్ పాల సేకరణ ధర లీటర్‌కు రూ.2.5 పెంచారని, ఏజెంట్లకు కమిషన్ టీటర్‌కు రూ.1.25 పెంచామని పేర్కొన్నారు. పశు వైద్యాధికారి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో 70 శాతం రైతులు అమూల్‌కు పాలు పోసే విధంగా సచివాలయం సిబ్బంది, వెలుగు సిబ్బంది, రూట్ ఆఫీసర్లు కృషి చేయాలని తెలిపారు. అమూల్‌కి పాలు పోసే పాడి రైతులకు డిసిసిబి బ్యాంక్ ద్వారా రుణాలు పొందే అవకాశం ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి పీరమ్మ, ఎంపిడిఓ శ్రీధరావు, వెలుగు ఆర్‌పిఎం మధు, వెటర్నరీ డాక్టర్ ఉస్మాన్, ఇఒపిఆర్‌డి జనార్దన్, ఎపిఓ మురళి, పిఆర్ఎఇ శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్‌లు నటరాజ నాయిక్, బాషా, విశ్వనాథ్‌రెడ్డి, జయమ్మ, భారతి, ఎంపిటిసి రవీంద్ర, పంచాయతీ కార్యదర్శులు జగన్ అయేషా, ఖాదర్ బాషా బాలాజీ, ప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు కేశవ పాల్గొన్నారు.

సౌర విద్యుత్ యూనిట్ ఏర్పాటు

ప్రజాశక్తి - రాయచోటి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం సౌరవిద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన ప్యానెల్స్‌ను ఐసిఐసి బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. బ్యాంకు అధికారి, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు రాజేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ హర్షలత పంకజ్ మాట్లాడుతూ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ కోసం సౌర విద్యుత్ యూనిట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో బి.శివమ్మ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రభుత్వ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రోగులు లేని గదిలో అగ్నిప్రమాదం సంభవించినందున, అగ్నిమాపక సిబ్బంది త్వరగా స్పందించడం వలన ఎటువంటి ప్రాణాపాయం సంభవించలేదు. మంటలను అదుపులో అగ్నిమాపక శాఖ ఎస్ఎఫ్ఒ శివ శంకర్‌రెడ్డి, ఎల్ఎఫ్ రవీంద్ర బాబు, డిఓపి శివ, ఎఫ్ఎంలు రాజేశ్వర్, శంకర్, చక్రి పాల్గొన్నారు.

డ్రైవర్లను తనిఖీలు నిర్వహిస్తున్న సిఐ నాగేంద్ర

మద్యం సేవించి వాహనాలు నడపడం నేరం : సిఐ

ప్రజాశక్తి -కలకడ

మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని సిఐ నాగేంద్ర అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్ ఎదుట వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనాన్ని నిలిపి పరిశీలించి వాహనం నడిపే డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడా లేదా అని యంత్రంతో తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించిన వారికి అపరాధ రుసుం విధించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. వేకువజామున డ్రైవర్లు నిద్రావస్థలో ఉంటారని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డ్రైవర్లను చల్లని నీటితో ముఖం శుభ్రం చేసి వారికి తగిన సూచనలు సలహాలు ఇచ్చి పంపిస్తామని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, యోగేష్, శ్రీనివాసులు, ప్రతాప్, సహదేవ, మహబూబ్ బాషా, హోంగార్డ్ రమేష్, గురవయ్య పాల్గొన్నారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు

తేక్వాండోలో రాజంపేట క్రీడాకారుల సత్తా

రాజంపేట అర్బన్ : తిరుపతి నగరంలోని విశ్వం హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన సౌత్ జోన్ జాతీయ స్థాయి తేక్వాండో పోటీలలో రాజంపేట పట్టణానికి చెందిన ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో సత్తా చాటారని గ్రాండ్ మాస్టర్ బి.సునీల్ తెలియజేశారు. సోమవారం స్థానిక జిఎంసి ప్రాంగణంలోని ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్ అకాడమీలో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించి వారికి పతకాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ సునీల్ మాట్లాడుతూ అకాడమీ నుంచి 19 మంది క్రీడాకారులు పోటీలలో పాల్గొని అద్భుత ప్రదర్శనతో అరుదు పతకాలను సాధించారని పేర్కొన్నారు. 4 స్వర్ణ పతకాలు, 4 రజతం, 11 కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. తన శిక్షణలో అనేక మంది క్రీడా కారులు స్పోర్ట్స్ కోటా ద్వారా ఉన్నత చదువులకు సీట్లు పొందారని, ప్రభుత్వ ఉద్యోగాలను పొందినట్లు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు పెద్దపీట వేసిందని, అవకాశాలను వినియోగించుకుని యువత క్రీడలలో రాణించాలని పేర్కొన్నారు. పేదలు ఎవరైనా తమ అకాడమీకి సహాయ సహ కారాలు అందించి ప్రోత్సహిస్తే దేశం గర్వించదగ్గ క్రీడాకారులను తయారు చేస్తా మన్నారు. మార్షల్ ఆర్ట్స్ ద్వారా ఆరోగ్యము, శారీరక దారుఢ్యం, మానసిక వికా సంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందించుకుని ఆత్మరక్షణ పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ ఉపాధ్యక్షులు బబోటే భాస్కర్, ప్రధాన కార్య దర్శి చౌడవరం నరసింహులు, సంయుక్త కార్యదర్శులు ఉమాశంకర్, గోవిందు నరసింహులు, కోశాధికారి టి.చంద్రశేఖర్, కె.నాగరాజు, కె.గంగారామ్ పాల్గొన్నారు.

వేమన పద్యాల పోటీలను విజయవంతం చేయండి

కలికిరి: వేమన కంఠస్థ పద్యాల పోటీల్లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు పులి సత్యారెడ్డి కోరారు. యోగి వేమన జయంతిని పురస్కరించుకొని రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ క్రీవారం నిర్వహిస్తున్న పద్యాల పోటీలలో పాల్గొనే విద్యార్థులు అందరూ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మండల పరిధిలోని పాఠశాలలలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ఆదివారం ఎస్ఎస్ కళ్యాణ మండపంలో మొదటి, రెండవ బహుమతులు ప్రదానం చేస్తా మన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, అధిక సం ఖ్యలో ఈ పోటీలలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పోలేరమ్మ ఆలయానికి గ్రానైట్ వితరణ

మదనపల్లి అర్బన్: మండలంలోని పోతబోలు పంచాయతీలోని పోతబోలు పోలేరమ్మ జాతర మార్చి నెల 14, 15వ తేదీలలో వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయ పునర్నిర్మాణానికి మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్‌ఖాన్ రూ.1.20 లక్షలు విలువచేసే గ్రానైట్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయం వద్ద గ్రామస్తులతో కలిసి ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోతబోలు చెరువు కట్టమీద వెలసిన దాదాపు 100 సంవత్సరాలు చరిత్ర గల అతి ప్రాచీన దేవాలయం దేవాలయాన్ని పునర్నిర్మించుకోవాలనే ఉద్దేశంతో గ్రామంలో ఉన్న 24 పల్లెల్లో ఉన్న కుల మతాలకతీతంగా అందరూ ఐక్యమై ఈ దేవాలయాన్ని నూతనంగా పునః నిర్మించుకుంటున్నామని తెలిపారు. పోలేరమ్మ దేవాలయానికి సంబంధించి పూర్తిగా గ్రానైట్ అమ్మవారి మీద ఉన్న భక్తిశ్రద్ధలతో ఇచ్చానన్నారు. దేవాలయంలో ప్రతి పదవ సంవత్సరాలలో ఒకసారి గంగజాతర మిన్నంటేలా ముందరోజు ముందరండి జరిపిస్తారన్నారు. రెండు రోజులు కొన్ని వేల మంది భక్తులు పాల్గొని ఎంతో భక్తిగా జాతరను జరిపిస్తారన్నారు. ఈ దేవాలయానికి దాదాపు రూ.30 లక్షలు పైగా గ్రామస్తులు అందరూ కలిసి ఆలయాన్ని పునర్నిర్మించుకున్నట్లు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్‌ఖాన్

'మిట్స్'లో ఘనంగా రేడియో దినోత్సవం

రేడియో దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-కురబలకోట

మదనపల్లె మిట్స్ కళాశాలలో సోమవారం ప్రపంచ రేడియో దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ మాట్లాడుతూ రేడియో ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించేందుకు ఫిబ్రవరి 13న ప్రపంచ రేడియో దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. అనేక దేశాలలో ఇది సమాచారాన్ని అందించడానికి ప్రాథమిక మూలమన్నారు. మాస్క్ మీడియా రంగం తొలుత ప్రింట్ మీడియంతో ప్రారంభమైందని తెలిపారు. చాలా ఏళ్లు ప్రింట్ మీడియా ద్వారానే వార్తలు తెలిసేవని చెప్పారు. టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కొద్దీ, శాస్త్రవేత్తలు ధ్వని తరంగాల ద్వారా వార్తలను ప్రసారం చేయడం ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ ప్రయత్నాలే రేడియో ఆవిష్కరణకు తొలి అడుగులన్నారు. 19వ శతాబ్దం మధ్యకాలంలో రేడియో అందుబాటులోకి వచ్చిందన్నారు. నిర్దిష్ట బ్యాండ్ విడ్త్‌కు ధ్వని తరంగాలను ప్రసారం చేసేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మన దేశంలో 20వ శతాబ్దం తొలి నాళ్లలో రేడియో అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. రేడియో ప్రధాన వార్తా ప్రసార మాధ్యమంగా అవతరించేందుకు చాలా ఏళ్లు పట్టిందని చెప్పారు. చదువులేని వారికి సమాచారాన్ని సులభంగా చేరవేసేందుకు గానూ రేడియోలలో వార్తలు ప్రసారం చేయడం ప్రారంభించారని తెలిపారు. వార్తా పత్రికలు చదవలేని వారు, ధ్వని రూపంలో వార్తలను వినడం ద్వారా విషయాలను అర్థం చేసుకోవడం పెరిగిపోయిందన్నారు. ఈ మాధ్యమం వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి ఏడా ఫిబ్రవరి 13న వరల్డ్ రేడియో డేను జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. అధునాతన సాంకేతికతతో దూసుకుపోతున్న ఆధునిక యుగంలోను రేడియో తన ప్రత్యేకతను చాటుకుంటోందన్నారు. కరోనా సంక్షోభం సమయంలో ఎన్నో నకిలీ వార్తలు ఇంటర్నెట్లో వివరించగా రేడియోలో విశ్వసనీయమైన వార్తలను మాత్రమే ప్రసారం చేశాయన్నారు. కమ్యునిటీ రేడియో వ్యవస్థ కూడా ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందిందన్నారు. అతి త్వరలో ఈ కమ్యునిటీ రేడియోను మిట్స్ కళాశాలలో ఘనంగా ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రేడియో జాకీలు, విద్యార్థులు అధ్యాపకుల పాల్గొన్నారు.

జమ్మలమడుగుపై సిఎంకు ప్రత్యేక శ్రద్ధ : ఎంపీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు మండల పరిధిలోని కన్యతీర్థం సమీపంలో నిర్మించనున్న వైఎస్ఆర్ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి ఈనెల 15న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమిపూజ చేయనున్నట్లు కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు ప్లాంట్ నిర్మాణ ప్రదేశాన్ని సోమవారం ఎంపి, ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి జిందాల్‌తో ఒప్పందం మేరకు ఈనెల 15న సిఎం జగన్ భూమిపూజ చేస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని ఉన్నప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. జమ్మలమడుగుపై ముఖ్యమంత్రికి ప్రత్యేకశ్రద్ధ ఉందన్నారు. కరోనా మహమ్మారితో మూడేళ్ల నుండి ఆర్థికంగా ఎన్నో కష్టనష్టాలు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృఢ సంకల్పంతో ఉక్కు పరిశ్రమ నిర్మాణం ఇక వేగవంతంగా జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ నిర్మాణంతో జమ్మలమడుగు నియోజకవర్గంలో ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి కలలుగన్న ఉక్కు పరిశ్రమ నిర్మాణం ఇకపై వేగవంతంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, వైసిపి పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ మార్బుల్ శీను, పార్టీ సీనియర్ నాయకులు రిషికేశ్వర్‌రెడ్డి, పాముల బ్రహ్మానందరెడ్డి, మంగదొడ్డి సింగరయ్య, ఎంపిటిసి వేపరాల కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎన్‌సిసి విద్యార్థులను అభినందిస్తున్న జెసి తమీమ్ అన్సారీయా

స్కౌట్ విద్యార్థులకు జెసి అభినందనలు

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రపతి చేతుల మీదుగా అందించే గోల్డెన్ యారో అవార్డుకు ఎంపికైన స్కౌట్స్ విద్యార్థులను జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా నుంచి ఆరుగురు విద్యార్థులు రాష్ట్రపతి అవార్డుకు ఎంపిక కావడం శుభపరిణామమన్నారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన స్కౌట్ అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. డిఇఒ రాఘవరెడ్డి మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 23 వరకు హర్యానాలో నిర్వహించే గోల్డెన్ యారో అవార్డు ఉత్సవంలో విద్యార్థులు అవార్డులను అందుకోకున్నారు. ఎంపికైన విద్యార్థుల్లో బి. భువనేష్ (కురుబలకోట), బి. చరిత్‌రెడ్డి, బి. కార్తీక్ (వాయల్పాడు), ఎన్. శ్రీనివాసులు, బి. అభిషేక్, నవీన్‌కుమార్ (మదనపల్లె) ఉన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడి జయరాజు, స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన

ప్రజాశక్తి- వీరబల్లి

చర్మం పై స్పర్శ లేని, రాగి రంగు కలిగిన మచ్చలుంటే అవి కుష్టువ్యాధి లక్షణాలు కావచ్చని, వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించుకుని ప్రభుత్వపరంగా ఉచితంగా ఇచ్చే మందులు వాడడం ద్వారా నివారించవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ వినయ్ బాబు సూచించారు. సోమవారం మండలంలోని పెద్దవీడు సచివాలయ సిబ్బందికి, గ్రంధి వాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినయ్ బాబు మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేకపోవడం, రాగి రంగు మచ్చలు, చర్మం పొడిగా ఉండడం, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, అరచేతులు, కాళ్లలో స్పర్శ కోల్పోవడం, కాళ్లకు వేసుకున్న చెప్పులు జారిపోవడం, చల్లని లేదా వేడి వస్తువులతో స్పర్శ లేకపోవడం వంటివి కుష్టువ్యాధి అనుమానిత లక్షణాలన్నారు. కుష్టు రోగులపై వివక్ష చూపకూడదన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సుధాకర్, పిహెచ్ఎన్ గంగులమ్మ, ఎఎన్ఎం రాజేశ్వరి, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్పర్ భద్ర ప్రాజెక్ట్‌తో రాయలసీమ ఎడారే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అప్పర్‌భద్ర ప్రాజెక్ట్‌తో రాయలసీమ ఎడారి ప్రాంతం అవుతుందని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాక ప్రతాపరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నాటక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం అప్పర్‌భద్ర ప్రాజెక్ట్‌ను జాతీయ ప్రాజెక్ట్‌గా గుర్తించిందన్నారు. మొన్నటి బడ్జెట్‌లో రూ.5500 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. ఈ విషయంలో రాయలసీమ బిజెపి నాయకులు స్పృహలేకుండా ఉన్నారన్నారు. తుంగభద్ర నుండి నీళ్లు కిందికి రాకపోతే రాయలసీమతోపాటు అంధ్రప్రాంతం కూడా ఇబ్బంది పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలం డ్యాంలో నీళ్లు లేనప్పుడు అంధ్రప్రాంతం కూడా తుంగభద్ర డ్యాం ద్వారా లబ్ధి పొందిందని, ఈ సంవత్సరం తుంగభద్ర నీళ్లు శ్రీశైలం డ్యాం నుండి ఆంధ్ర ప్రాంతానికి తద్వారా సముద్రానికి దాదాపు 500 టియంసీ వెళ్లాయని, ఆంధ్ర ప్రాంతంలోని నాయకులు ఈ అప్పర్‌భద్ర డ్యాంను వ్యతిరేకిస్తుంటే రాయలసీమలోని బిజెపి నాయకులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. దీనిపై ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించాలన్నారు. లేనిపక్షంలో రాయలసీమ ద్రోహులుగా మిగిలిపోతారన్నారు. అప్పర్‌భద్ర ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 25 నుండి మూడు రోజుల పాటు రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టున్నట్లు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. రాయలసీమ ప్రేమికులు పార్టీల కతీతంగా ఈ పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేస్తాం

ప్రజాశక్తి - వీరబల్లి

మాట్లాడుతున్న ఎపిఎం ఖాదర్‌వలి

రైతు ఉత్పత్తి దారుల సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని ఎపిఎం ఖాదర్‌వలి, జవాహర్‌బాష అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన మండల రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయంపై పెట్టుబడికి కావాల్సిన రుణాలను తక్కువ వడ్డీతో ఇస్తున్నామన్నారు. ప్రతిరైతూ తృణధాన్యాల పంటలు వ్యవసాయంలో ఒక భాగంగా పండించాలని సూచించారు. ప్రభుత్వం 2023-24 ఏడాదిని తృణధాన్యాల సంవత్సరంగా పరిగణించిందన్నారు. కార్యక్రమంలో సిసి వెంకటలక్ష్మి, సమాఖ్య అధ్యక్షులు కె. సుబ్బరామరాజు, కార్యదర్శి రామాంజనేయులు, కోశాధికారి శివయ్య, రైతు మిత్రలు జనమేజయుడు, వెంకటేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ లిస్టును పరిశీలించి న్యాయం చేయండి

ప్రజాశక్తి-నందలూరు

రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి పసుపులేటి ప్రవీణ్ కుమార్ కలిసి ఓటర్ లిస్టు ప్రకారం ఉన్న మార్పులు, చేర్పులపై వివరించి సంబంధిత రుజువులను ఆయనకు అందజేసి వాటిని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సోమవారం పసుపులేటి ప్రవీణ్ మాట్లాడుతూ 2022వ సంవత్సరం ఓటర్ లిస్టును మండల టిడిపి నేతల ద్వారా పూర్తిగా పరిశీలన చేయించి చనిపోయిన, డబల్ ఎంట్రీ, ఊరు వదిలి వెళ్ళిపోయిన వారివి ఓట్లను గుర్తించి వాటిని సంబంధిత మండల తహశీల్దార్ ఉదయ శంకర్ రాజు కు ఓటరు దరఖాస్తు పత్రం-7, కొత్త ఓటర్లని దరఖాస్తు 6 ద్వారా పొందుపరిచి అందజేశామని పేర్కొన్నారు. 2023 ఓటర్ లిస్టులో పలు అంశాలతో మేము తీసేయమని ఇచ్చిన వాటిని పరిశీలిస్తే కనీసం 10 శాతం ఓట్లను కూడా తొలగించలేకపోయారని ఆరోపించారు. ఇప్పటికైనా ఓటర్ లిస్టును నిశితంగా పరిశీలించి అందజేసిన రుజువులను పరిగణలోకి తీసుకొని వాటిని తొలగించవలసిందిగా సబ్ కలెక్టర్ కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE RLY.KODUR.
OS. No.183/2022

Devanapalli Rama Subbamma, W/o Late. Krishnaiah, at Lakshmigaripalli Village, Rly kodur mandal, Annamayya (Dist).
...Plaintiff

Vs

D2. Devanapalli, Venkataiah, S/o. Late Venkatesh, Lakshmigaripalli Village, Rly kodur mandal, Annamayya (Dist).
...Defendants

వాది, మీపైన మరియు ఇంకొందరి పైన Suit Schedule Property గురించి పైకోర్టు నందు Permanent injunction కోరుచూ దావా దాఖలు చేసి వున్నారు. ఇందు విషయమై మీ కేలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల తేది.15.02.2023న ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు నందు హాజరై ప్రత్యక్షంగాని, పరోక్షంగా గాని తెలుపుకొనగలరు. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

//By Order of the Court//
R.C. SURESH BABU
Advocate,
RLY.KODUR.

మహారాజశ్రీ రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
O.S.NO : 52/2012

చెన్నూరు శీనయ్య తండ్రి లేట్ వెంకటరామయ్య. వై. కోట గ్రామము & పోస్టు, ఓబులవారిపల్లె మండలం. **...వాది**

V/S

D-23. నాగేంద్ల సునీత భర్త కుమార్, తండ్రి లేట్ పోకూరు వెంకటయ్య, డోర్ నెం : 5/94, యల్లాగడ్డ, తాళ్లపాక గ్రామం & పోస్టు, రాజంపేట మండలం, అన్నమయ్య జిల్లా.
D-24 పోకూరు జానకిరామయ్య తండ్రి లేట్ పోకూరు వెంకటయ్య. డోర్ నెం : 5/94, ఎలాగడ్డ, తాళ్లపాక గ్రామం & పోస్టు, రాజంపేట మండలం, అన్నమయ్య జిల్లా.
...ప్రతివాదులు నెం:23 & 24

పై కనబరిచిన వాది,ప్రతివాదులు నెంబర్ 23 మరియు 24 అగు మీపై దావా ఆస్తి పైన తన యాజమాన్య హక్కుని దృఢపరచమని మరియు మీపై శాశ్వత ఇంజెక్షన్ కోరుతూ పై కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. ఆక్షేపణలున్న యెడల 14-02-2023 వ తేదీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా కానీ హాజరై మనవి చేసుకోగలరు. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
కె.సురేష్,
వాదిపరం అడ్వకేట్, రైల్వేకోడూరు.

మహారాజశ్రీ రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO : 14/2020

ఉప్పు వెంకటసుబ్బమ్మ మరియు ఇతరులు, భర్త ఉప్పు బాల నరసింహులు సాకిన్ డోర్ నెం: 47/A, రామ్‌నగర్, రాజంపేట టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా.
...వాదులు

V/S

D1. ఉప్పు నరసింహులు చనిపోయినందున వారి వారసులు
D5. ఉప్పు లక్ష్మీదేవి భర్త లేట్ ఉప్పు నరసింహులు,
D7. ఉప్పు ద్రాక్షాయణి, తండ్రి లేట్ ఉప్పు నరసింహులు, భర్త సుంకర రమణ
D8. ఉప్పు లక్ష్మీప్రసన్న, తండ్రి లేట్ ఉప్పు నరసింహులు, డోర్ నెం : 2/65-A, రామ్ నగర్, రాజంపేట టౌన్ మరియు అన్నమయ్య జిల్లా.
...ప్రతివాదులు

వాదులు, ప్రతివాదులు అయిన మీ పై , వగైరాలపై భాగ పరిష్కారం మరియు పర్మినెంట్ ఇంజెక్షన్ కోరి దావా దాఖలు చేసియున్నారు. సదరు విషయమై ప్రతివాదులైన మీకు ఎలాంటి ఆక్షేపణలున్న యెడల మీరు గానీ, మీ వకీలు గారి ద్వారా గానీ 07-03-2023వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలసినది. లేనంతట పరోక్షమందు తీర్మానించబడునని ఖండితముగా తెలుపడమైనది.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
పి.వల్లభరావు
అడ్వకేట్, రాజంపేట.

టాస్ వేస్తున్న సర్పంచ్ లోకనాథ్‌రెడ్డి

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-పీలేరు

నాలుగు రోజుల క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించినట్లు కావలిపల్లి పంచాయతీ సర్పంచ్ లోకనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఒంటిల్లు గ్రామంలో సోమవారం ప్రారంభమైన శ్రీ రెడ్డి వారి గంగమ్మ క్రికెట్ టోర్నమెంట్లో 8 జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఈ పోటీల్లో విన్నర్స్ జట్టుకు రూ.20 వేలు, రన్నర్స్ జట్టుకు రూ.15 వేలు నగదు బహుమతిని ప్రధానం చేయనున్నట్లు చెప్పారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతి కూడా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అశోక్, ప్రకాష్, నూరు, సయ్యద్ షావలి, సద్దాం, ప్రసాద్, రామానాయుడు పాల్గొన్నారు.

జరి మహోత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

జరి మహోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -కలకడ

మండలంలోని దేవళంపేటలో వెలిసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 19వ తేదీన నిర్వహించిన జరి మహోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లను సిఐ నాగేంద్ర, ఎంపిడిఒ సిహెచ్ నారాయణ సోమవారం పరిశీలించారు. ఈ నెల 18వ తేదీ మహాశివరాత్రి పండుగ అనంతరం మరుసటి రోజు 19 తేదీన జరి మహోత్సవం నిర్వహిస్తారు. జరి మహోత్సవానికి లక్షల సంఖ్యలో భక్తులు వస్తారు. ట్రాఫిక్ నియంత్రించే క్రమంలో సిఐ పరిశీలించి ఏర్పాట్లను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిప్పేస్వామి, సర్పంచ్ విశ్వనాథ నాయుడు, సింగల్ విండో చైర్మన్ కమలాకర్‌రెడ్డి, హెచ్ఒ సుకుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నందిని, విఎఎ చందన, మహిళా పోలీసు స్వాతి కుమారి, పోలీస్ సిబ్బంది శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ

వంటల పోటీ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం విద్యాశాఖ అధికారి వెంకటేష్ నాయక్ అధ్యక్షతన మండలంలో అన్ని పాఠశాలలో పనిచేస్తున్న వంట వారికి వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మండలంలోని మహిళా ఉపాధ్యాయులు వ్యవహరించారు. ఈ పోటీలకు మండలంలోని 30 పాఠశాలలకు చెందిన వంటవారు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి మొదటి నాలుగు బహుమతులుగా చీరలు, ఐదో బహుమతిగా వాటర్ ప్లాస్క్‌ను అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి వంట వారికి క్యారియర్‌ని బహుమతిగా అందించారు. కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ ధర్నాకు విఆర్ఎలు తరలిరండి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విఆర్ఎల సమస్యల సాధన కోసం ఈ నెల 14వ తేదీన కలెక్టర్ కార్యాయలం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షులు ఎస్.గౌస్‌మోదీన్, ఉపాధ్యక్షులు సి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి డి.శివమ్మ, సహాయ కార్యదర్శి వి.నాగరాజ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.రత్నమ్మ పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన ముఖ ఆధారిత హాజరు నుండి విఆర్ఎలకు మినహాయింపునివ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన విఆర్ఎలకు విఆర్ఒలుగా, అటెండర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ధర్నాకు మండలంలో పనిచేస్తున్న విఆర్ఎలంతా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

క్రైం కార్నర్

ప్రమాదంలో దెబ్బతిన్న అంబులెన్స్

లారీ, అంబులెన్స్ ఢీ : నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-పీలేరు

సిమెంటు లోడు లారీని వెనుక నుంచి ప్రయివేటు అంబులెన్స్ ఓవర్టేక్ చేయబోయి ఆదే లారీని ఢీకొంది. ఈ సంఘటనలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు పీలేరు-కడప జాతీయ రహదారిలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాద వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటికి చెందిన ఓ మహిళ గుండెపోటుతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు ఆమెను ఓ ప్రయివేటు ఆంబులెన్స్‌లో తిరుపతికి తరలిస్తుండగా, అదే సమయంలో బనగానపల్లి నుంచి తమిళనాడుకు సిమెంటు లోడుతో వెళుతున్న లారీ వెనుక చక్రం పీలేరు పట్టణ శివారులోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బరస్ట్ అవడంతో, అంబులెన్స్ లారీని ఢీకొందని తెలిసింది. ఈ ఘటనలో రాయచోటికి చెందిన మహబూబ్ జాన్, రహత్ జాన్, ముబీనా, అంబులెన్స్ డ్రైవర్ సమీవుల్లా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారిని మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. ఈ ఘటనలో అంబులెన్స్ ముందు భాగం నుజ్జు నుజ్జయ్యింది. పీలేరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.